

జిల్లా కమిటీ చైర్మన్‌గా బీకే



పెనుకొండ, ఆగస్టు 13: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ బీకే పార్థసారథిని కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ నియమించింది. ఈ విషయాన్ని మంగళవారం ప్రకటనలో బీకే వెల్లడిచారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సరైన సమయంలో పూర్తిచేయడం, సమర్థవంతంగా అమలు చేయడం, వెనుకబడిన తరగతులకు సంబంధించిన పథకాలు వారికి అందేలా చూడటం చైర్మన్ బాధ్యత. అనంతపురం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితుడిగా సైతం తనను నియమించినట్లు బీకే వెల్లడించారు.

తీరనున్న ఆకలి బాధలు..

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లు
పురంలో 15న రెండింటి ప్రారంభానికి ఏర్పాట్లు



ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

పుట్టపర్తి, ఆగస్టు 13: పేదల ఆకలి బాధలు తీరనున్నాయి. రూ.5కే కడుపునిండా భోజనం అందించే అన్న క్యాంటీన్లు పునఃప్రారంభంకానున్నాయి. ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో రెండింటికి శ్రీకారం చుట్టనున్నారు. హిందూపురంలోని చిన్నమార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రారంభించనున్నారు. దీంతో పేదవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే పేదలు హోటళ్లలో పెద్దమొత్తంలో డబ్బు వెచ్చించి, భోజనం చేసే స్థోమతలేక ఇబ్బందులు పడుతుండేవారు. పలువురు పస్తులతో సొంతూళ్లకు తిరిగి వెళ్తుండేవారు. దీనిని గమనించి, పేదలకు రూ.5కే కడుపునిండా భోజనం అందించేందుకు గత టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఎంతోమంది నిరుపేదలకు కడుపునిండా భోజనం పెట్టారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టగానే అన్న క్యాంటీన్లను మూసేశారు. పేదోడి కడుపు కొట్టారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అన్న క్యాంటీన్లకు పూర్వవైభవం సంతరించుకుంటోంది. రోజూ మూడుపూటలా అల్పాహారం, భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాకేంద్రంతోపాటు కదిరి, ధర్మవరం, మడకశిరలో అన్న క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. దీంతో పేదల ఆకలి కష్టాలు తీరనున్నాయి.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

అనంతపురం జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లికార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

14, 15, 16 తేదీల్లో అనంతపురం జిల్లా లోని, కీర్తి రెసిడెన్సి, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ. 100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు **youtube: pulipiri mallikarjun**లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 20 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

అర్ధరాత్రి కుంభవృష్టి..



ధర్మవరంలోని గాంధీనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

- ఇళ్లలోకి చేరిన నీరు
- హిందూపురం మార్కెట్‌లో తడిసిన పట్టుగూళ్లు
- ధర్మవరంలో పట్టుచీరల దుకాణంలోకి నీరు
- పలుచోట్ల కూలిన విద్యుత్ స్తంభాలు
- సోమందేపల్లి మండలంలో పడిపోయిన ఇంటి పైకప్పు
- మల్లయ్యగారిపల్లి తండాలో గొర్రెల మృతి
- భారీగా ఆస్తి నష్టం
- నల్లచెరువులో 200.2 మి.మీ. వర్షపాతం

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 13: జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి కుంభవృష్టి కురిసింది. పగలంతా ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం.. రాత్రి భారీ వర్షంతో ఉలిక్కిపడ్డారు. కుండపోత వాన కురిసింది. మురుగు కాలువలు నిండిపోయి, నీరు రోడ్లపైకి చేరింది. ఇళ్లలోకి పెద్దఎత్తున చేరింది. దీంతో సామగ్రి తడిసిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లోకి భారీగా నీరు చేరింది. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పట్టుగూళ్లు తడిసిపోయాయి. కదిరి మండలం మల్లయ్యగారిపల్లి తండాలో 17 గొర్రెలు మృతిచెందాయి. పట్టుకేంద్రం ధర్మవరంలో శిల్క్ హౌస్‌లలోకి నీరు చేరింది. పట్టుచీరలు తడిసిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సోమందేపల్లిలోని గీతానగర్‌లో ఇల్లు కూలిపోయింది. ఇలా జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.

నల్లచెరువులో రికార్డుస్థాయి వర్షపాతం

జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అత్యధికంగా నల్లచెరువులో 200.2 మి.మీ, రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. తనకల్లు 94.6, అమడగూరు 86.4, కదిరి 84.2, హిందూపురం 74.6, ధర్మవరం 62.4, పెనుకొండ 57.0, కొత్తచెరువు 56.4, ఓబుళదేవరచెరువు 55.4, సోమందేపల్లి 50.4, బుక్కపట్నం 49.6, రామగిరి 46.4, పరిగి, గోరంట్ల 45.2, చెన్నేకొత్తపల్లి 42.2, పుట్టపర్తి 39.8, లేపాక్షి 37.2, నల్లమాడ 35.4, చిలమత్తూరు 32.6, రొద్దం 25.4, గాండ్లపెంట 15.2, నంబులపూలకుంట 14.0, అగళి 10.6, మడకశిర 9.8, కనగానపల్లి 4.6, తలుపులలో 3.2 మి.మీ. వర్షం కురిసిందన్నారు.



కదిరి మండలం మల్లయ్యగారిపల్లి తండాలో ఇంట్లోకి చేరిన వర్షపునీరు



ధర్మవరంలోని శిల్క్‌హౌస్‌లో తడిసిన పట్టుచీరలను తొలగిస్తున్న దృశ్యం

తడిసిన పట్టుచీరలు

ధర్మవరం: పట్టణంలో భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎల్‌పీ సర్కిల్లోని వ్యాపారి సుధాకర్ నిర్వహిస్తున్న దుస్తుల దుకాణంలోకి వర్షపు నీరు చేరి, పట్టుచీరలు, వివిధ రకాల దుస్తులు తడిసిపోయాయి. ఇంటికి అమర్చిన పీఓపీ కూడా చీలి, పైకప్పు కూలిపోయింది. దీంతో రూ.3లక్షలదాకా నష్టపోయాడు. జగ్జీవన్‌రామ్‌నగర్‌లో విజయ్‌కుమార్‌తోపాటు మరో నలుగురి ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో సామగ్రి, సరుకులు తడిసిముద్దయ్యాయి. పార్థసారధినగర్, పీఆర్‌టీ, శ్రీదేవివిహార్, శివానగర్ తదితర ప్రాంతాల్లో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది.



కదిరి మండలం మల్లయ్యగారిపల్లి తండాలో మృతిచెందిన గొర్రెలు

17 గొర్రెల మృతి

కదిరిఅర్బన్: భారీ వర్షానికి మండలంలోని మల్లయ్యగారిపల్లి తండాలో 17 గొర్రెలు మృతిచెందాయి. పలు ఇళ్లలోకి నీరు చేరి, నిత్యవసర సరుకులు, తిండిగింజలు తడిసిపోయాయి. అర్ధరాత్రి ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో గ్రామానికి అనుకుని ఉన్న వంక కాలువ ఉధృతంగా ప్రవహించి, గొర్రెల మంద, ఇళ్లలోకి భారీగా నీరు చేరింది. దీంతో నాగేనాయక్‌కు చెందిన 17 గొర్రెలు నీట మునిగి, చనిపోయాయి. దీంతో రూ.2.40 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు.



హిందూపురంలో షాపులోకి చేరిన వర్షపు నీరు



పురం వీధిలో నిలిచిన నీరు

కూలిన ఇంటి పైకప్పు

హిందూపురం(సోమందేపల్లి): వర్షానికి సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన కురుబ గంగాధర్ ఇంటి పైకప్పు కూలిపోయింది. గంగాధర్ కుటుంబీకులు సోమవారం రాత్రి ఇంట్లోనే నిద్రించారు. వర్షానికి సగం పైకప్పు ఒక్కసారిగా కూలింది. గంగాధర్ కుటుంబీకులు నిద్రించిన ప్రాంతంలో పైకప్పు కూలకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి ధ్వంసమై, రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. తహసీల్దార్ కార్యాలయ ప్రహరీ ఒకవైపు కూలిపోయింది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

తనకల్లు: మండలంలోని కోటపల్లి సమీపాన వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా నిమిత్తం విద్యుత్ లైన్ నిర్మిస్తున్నారు. పనులు పూర్తికాకపోవడంతో విద్యుత్ సరఫరా లేదు.

పట్టు రైతుకు కన్నీళ్లు



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో తడిసిపోయిన పట్టుగూళ్లు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రసిద్ధిచెందిన పట్టు గూళ్ల మార్కెట్‌లోకి వర్షపునీరు చేరి, రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. సోమవారం రాత్రి మార్కెట్‌కు దాదాపుగా 4 టన్నుల పట్టుగూళ్లు వచ్చాయి. రైతులు రాత్రి అక్కడే పడుకుని, ఉదయం మార్కెట్‌లో పట్టుగూళ్లు విక్రయించుకుందామనుకున్నారు. భారీ వర్షం వారికి నష్టం మిగిల్చింది. కాలువలు నిండిపోయి నీరు మార్కెట్‌లోకి ప్రవేశించింది. పట్టుగూళ్లు తడిసిపోయాయి. మార్కెట్ అంతా నీరు చేరడంతో కొంతమంది ట్రేలలో వేసుకున్నారు. మరికొందరు సంచుల్లో వేసుకుని, భద్రపరిచారు. ఇంతలో దాదాపు 150 కిలోల వరకు గూళ్లు నీటిలో తడిసిముద్దయిపోయాయి. దీంతో రూ.60వేలకుపైగా నష్టం వాటిల్లిందని రైతులు కంటతడి పెట్టుకున్నారు.



కూలిన ఇంటి వద్ద గంగాధర్ కుటుంబం



రోడ్డుకి అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

20 నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే

పుట్టపర్తి, ఆగస్టు 13: ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే ఆగస్టు 20న ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్.. జిల్లా కలెక్టర్లు, ఈఆర్వోలను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి ఎన్నికల ప్రధానాధికారి.. కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పాల్గొన్నారు. ఈసీ మాట్లాడుతూ.. అక్టోబరు 18 వరకు ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు దరఖాస్తులను పరిశీలించాలన్నారు. అక్టోబరు 29న సంక్షిప్త ముసాయిదా ఓటరు జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించాలన్నారు. జనవరి 1వ తేదీలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలనీ, జనవరి 6న సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రకటించాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు.

దేశభక్తి పెంపొందేలా హర్ ఘర్ తిరంగా: కలెక్టర్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 13: ప్రతిఒక్కరిలో జాతీయత, దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహించుకుందామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం కలెక్టర్ జెండా ఊపి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమైక్యత, సమగ్రత, దేశభక్తిని పెంపొందించే మహోన్నత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



వైసీపీ నిర్లక్ష్యం... పట్టు రైతుకు శాపం

పురం పట్టుగూళ్ల మార్కెట్‌ను పట్టించుకోని గత పాలకులు

- 2022లో 15 రోజులు నీటిలోనే మార్కెట్
- రైతుకు తీవ్రనష్టం
- కొత్త భవనం నిర్మిస్తామంటూ అప్పట్లో హామీలు
- ఆ తర్వాత పట్టించుకోని వైసీపీ నాయకులు
- మళ్లీ నష్టంపై అన్నదాత ఆవేదన

హిందూపురం అర్బన్, ఆగస్టు 13: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. పట్టు రైతులకు శాపంగా మారింది. నిండాముంచింది. 2022లో భారీ వర్షాలకు వరద నీరు హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌ను ముంచెత్తింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 15 రోజులపాటు మార్కెట్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. కార్యకలాపాలు స్తంభించాయి. అప్పట్లో బాధిత రైతులను గత వైసీపీ పాలకులు పరామర్శించారు. ఆదుకుంటామని హామీలు గుప్పించారు. కొత్త మార్కెట్ భవనాన్ని నిర్మిస్తామని ప్రగల్భాలు పలికారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడిస్తామని పలుమార్లు పట్టు రైతులు, రీలర్లను పిలుచుకెళ్లారు. ఒక్కసారి కూడా అప్పటి ముఖ్యమంత్రి మాట్లాడింది లేదు. ఆ అవకాశం కూడా ఇవ్వలేదు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకున్న జగన్.. వారికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. దీంతో వెళ్లడం.. నిరాశగా వెనుదిరగడం రైతులు, రీలర్ల వంతైంది. కొత్త మార్కెట్ భవన నిర్మాణ హామీని గాలికొదిలేశారు. వారి నిర్లక్ష్యం మూలంగా ప్రస్తుతం నష్టపోవాల్సి వచ్చిందని పట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన భారీ వర్షానికి పట్టుగూళ్ల మార్కెట్‌లోకి నీరు చేరింది. దాదాపు 150 కిలోల పట్టుగూళ్లు తడిసిపోయి, రూ.60 వేల దాకా రైతులు నష్టపోయారు. ఆరుగాలం కష్టించి, పండించిన పంటను అమ్ముకుందామని మార్కెట్‌కు వచ్చిన రైతు కన్నీళ్లు పెట్టుకున్నాడు. కడుపుమండి నిరసనకు దిగాడు.



2022లో పట్టుగూళ్ల మార్కెట్‌ను ముంచెత్తిన వరద (ఫైల్)

హామీలు ఇచ్చి..

పట్టుగూళ్ల మార్కెట్‌కు హిందూపురం పరిసర ప్రాంతాలతోపాటు మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కదిరి, అనంతపురం, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, కర్నూలు, మహబూబ్‌నగర్, చిత్తూరు, కడప జిల్లాల నుంచి కూడా పట్టు రైతులు వస్తుంటారు. 2022లో వచ్చిన భారీ వర్షాలకు అప్పట్లో పట్టుగూళ్ల మార్కెట్ జల దిగ్బంధంలో చిక్కుకుంది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వంలో నాయకులు, అధికారులు వచ్చి పట్టు రైతులు, రీలర్లను ఓదార్చారు. రైతులు నష్టపోకుండా నూతన మార్కెట్ భవనం నిర్మిస్తామని హామీలు గుప్పించారు. ఆ తర్వాత వాటిని విస్మరించారు. పట్టు రైతును పట్టించుకున్న పాపాన పోలేదు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నష్టపోయిన రైతులు నిరసనకు దిగారు. తడిసిన పట్టుగూళ్లను మంగళవారం రోడ్డుపై పోసి, అక్కడే బైఠాయించారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు రావాలని డిమాండ్ చేశారు.



తడిసిన పట్టుగూళ్లను రోడ్డుపై పడేసి, నిరసన తెలుపుతున్న రైతులు, రీలర్లు

పట్టించుకున్న పాపానపోలేదు

2022లో పట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారు. దానిని దృష్టిలో ఉంచుకుని, మరోమారు ఇలా నీరు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మళ్లీ రైతు నష్టపోవాల్సి వచ్చింది.

- జయరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మా కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం అప్పటి ముఖ్యమంత్రి జగన్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఇటీవల గుండుమల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రాబుబు దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- ముస్తఫా, పట్టురీలర్ల సంఘం నేత

చురుగ్గా గేటు ఏర్పాటు పనులు

- ఐదు భాగాలుగా విడగొట్టి టీబీ డ్యాం క్రస్ట్ గేటు తయారీ
- సీఎం చంద్రబాబు చొరవతో కన్నయ్యనాయుడి రాక
- కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో కలిసి రాష్ట్ర మంత్రులు పయ్యావుల, నిమ్మల సందర్శన



కన్నయ్యనాయుడితో చర్చిస్తున్న మంత్రులు

రాయదుర్గం, ఆగస్టు 13: తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడే మకాం వేసి పనులను వేగవంతంగా సాగేలా పర్యవేక్షిస్తున్నారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో కలిసి రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, జయరాంలు డ్యాంను మంగళవారం పరిశీలించారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ వద్ద పరిశీలించి అధికారులతో సమీక్షించారు. బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్ రెడ్డితో

పనులు పూర్తి చేయిస్తాం: సీఎం సిద్దరామయ్య

జలాశయం వద్దకు మంగళవారం చేరుకున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు సమన్వయంగా ముందుకెళ్లి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. క్రస్ట్‌గేట్ ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ అధికారులు సీడబ్ల్యూసీ ఆదేశాల ప్రకారం కన్నయ్యనాయుడు పనులు చేయిస్తున్నారని తెలిపారు. జలాశయంలో నీరు ఖాళీ అయినప్పటికీ మరిన్ని వర్షాలు కురిసి పనులు పూర్తి అయిన అనంతరం మళ్లీ జలాశయం నిండు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర, కర్ణాటకకు సంబంధించి తాగు, సాగుకు ఉపయోగపడే ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. పనులను వీలైనంత తొందరలో పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఇంజనీరింగ్ బృందాలు కష్టపడుతున్నాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. పనుల పర్యవేక్షణ కు ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

పాటు ఈఈలు, డీఈలతో సమీక్షలు నిర్వహించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో జలాశయాల క్రస్ట్‌గేట్ల నిర్మాణంలో విశేష అనుభవమున్న కన్నయ్యనాయుడును పిలిపించి ఆయన సారథ్యంలో తాత్కాలిక క్రస్ట్‌గేట్ పనులు జరిగేలా చూశారు. 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తున ఉండాల్సిన క్రస్ట్‌గేట్‌ను ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో దింపేందుకు సాధ్యపడదని అంచనాకు వచ్చి వాటిని ఐదు భాగాలుగా విడగొట్టారు. ఆ పనులను ఐదు కంపెనీలకు అప్పగించారు. 60 అడుగుల వెడల్పుతో నాలుగు అడుగుల ఎత్తున ఉండేలా షట్టర్లను తయారు చేయిస్తున్నారు. మరో మూడురోజుల్లో షట్టర్ల తయారీ ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఒక్కో షట్టర్‌ను ప్రవహిస్తున్న నీటిలో దింపి, ప్రవాహానికి అడ్డుకట్ట వేయనున్నట్లు వెల్లడించారు. వీటి కోసం అవసరమైన పెద్ద క్రేన్లను ఏర్పాటు చేసే బాధ్యతను జేఎస్‌డబ్ల్యు కంపెనీకి అప్పగించారు. బుధవారం ఉదయానికల్లా అవి చేరుకోనున్నట్లు తెలిపారు. జలాశయం వద్దకు సందర్శకులను అనుమతిని నిరాకరించారు. పోలీసులు పెద్ద ఎత్తున మొహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో మాట్లాడుతున్న మంత్రులు

సాయంత్రం దాకా పర్యటించిన మంత్రులు

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రాత్రికి తుంగభద్ర జలాశయం వద్దకు చేరుకుని అక్కడే మకాం వేశారు. మంగళవారం ఉదయాన్నే ఆర్థిక శాఖ



కొట్టుకుపోయిన గేటు వద్ద పరిశీలిస్తున్న మంత్రులు, నాయకులు


మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకుని సాయంత్రం వరకు ఉండి పనులను పరిశీలించారు. అధికారులతో చిత్రపటాలను తెప్పించుకుని చేస్తున్న పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక, సాంకేతిక పరమైన సహకారాన్ని పూర్తిగా అందిస్తామని బోర్డుకు హామీ ఇచ్చారు. దీనిపై ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించి ఇక్కడే ఉండేలా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధానంగా బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డితో పాటు ఇన్‌చార్జ్ ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డితో ఏకాంతంగా చర్చించి గేట్ కొట్టుకుపోవడానికి గల కారణాలు, వైఫల్యం గురించి సమీక్షించారు. అనంతరం జలాశయం వ్యూ పాయింట్ వద్ద కు వెళ్లి నీటి నిల్వ పరిస్థితిని వీక్షించారు.



గేటు తయారీలో నిమగ్నమైన కార్మికులు

ఇన్‌ఫ్లో గురించి ఆరా

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు నదికి వృథాగా వెళుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇన్‌ఫ్లో పరిస్థితుల గురించి అధికారులతో మంత్రులు ఆరా తీశారు. పదేళ్లుగా ఆగస్టు మాసం చివర్లో ఏ మేరకు ఏ మాత్రం ఇన్‌ఫ్లో ఉందో కనుక్కున్నారు. 60 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి క్రస్ట్‌గేట్ ఏర్పాటు పనులు పూర్తి అయితే అనంతరం ఎగువన వర్షాలు కురిసి నీరు చేరే అవకాశాలపై ఆరా తీశారు. సెప్టెంబరు మాసంలో కూడా వర్షాలు ఉంటాయని అంచన వేశారు. ప్రస్తుతం కాలువల కింద పంటల సాగులో ఉండి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్న రైతాంగం నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



వృథాగా పోతున్న నీటితో నిండిపోయిన డ్యాం పరిసర ప్రాంతాలు

మినీ బస్సు బోల్తా

ఒకరి మృతి...10 మందికి గాయాలు



తండ్రిని తట్టిలేపుతున్న కుమారుడు తనీష్, ఇన్‌సెట్‌లో బోనాల హరి(ఫైల్)

తాడిమర్రి, ఆగస్టు 13: మండలంలోని దాడితోట అదానీ హైడల్ పవర్ ప్రాజెక్టు సమీపంలో మినీ బస్సు బోల్తా పడింది. దీంతో కడప జిల్లాకు చెందిన బోనాల హరి(37) మృతి చెందగా మరో పది మంది గాయపడినట్లు ఎస్‌ఐ నాగాస్వామి తెలిపారు. మృతుడి భార్య ఉమా మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కడప జిల్లా సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామానికి చెందిన బోనాల హరి, ఆయన భార్య ఉమామహేశ్వరి కుమారుడు తనీష్ ద్విచక్రవాహనంలో కసనూరు నుంచి వెలిదండ్లకు వచ్చి అనంతపురం వెళ్తున్న మినీ బస్సు ఎక్కారు. అక్కడి నుంచి బస్సులోని వారితో కలిసి అనంతపురంలోని ఎస్‌ఎన్ హెర్బల్ న్యూట్రిషన్ వారు నిర్వహిస్తున్న సమావేశానికి బయల్దేరారు. దాడితోట సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. బోనాల హరి అక్కడికక్కడే మృతి చెందగా ఉమామహేశ్వరి, బాలచంద్రారెడ్డి, గోపాల్, శైలజ, దినేష్, హారిక, పెద్దవీరయ్య, హుసూరీబీ మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పులివెందులలోని వైద్య కళాశాలకు 108లో తరలించారు. డ్రైవర్ షేక్ మాబుషరీఫ్ మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు.

భయపడకు డాడీ..

ఘటనా స్థలంలో మృతుడు బోనాల హరి కుమారుడు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడాతున్న తండ్రిని చూసి ' భయపడకు డాడీ. నీకు ఏమీకాదు' అంటూ రోదించడం చూసిన వారందరూ కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్‌ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకుని బాధితులను విచారించేందుకు పులివెందులకు వెళ్లి పూర్తీ వివరాలను సేకరించినట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్

పామిడి, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన చాలా అవసరమని జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, లీగల్ సెల్ అథారిటీ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పాళ్యం తండా గ్రామంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, మేనరిక వివాహాలు మానవ మనుగడకు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తాయన్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం 204 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఈఓ జయానాయక్, గ్రామ సర్పంచు వెంకటేష్‌నాయక్, ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఉదయార్క, డాక్టర్ మంజుల, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి హామీలను నెరవేర్చుతాం: మాజీ సీఎం కిరణ్



మాట్లాడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: గడిచిన ఐదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని తీవ్రమైన ఆర్థిక లోటులోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఒక్కో అంశాన్ని సరిదిద్దుతూ, కూటమి పార్టీలు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జిల్లాలను విభజించి రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని అన్నారు. జిల్లాల విభజనతో వాటి అస్తిత్వాన్ని కోల్పోయాయని, తానే ముఖ్యమంత్రిని అయ్యుంటే జిల్లాలను మళ్లీ ఏకంచేసి పాత జిల్లాలుగానే ఉత్తర్వులు ఇచ్చేవాడినని అన్నారు. విభజన హామీల్లో భాగంగా రూ.1.5 లక్షల కోట్లు ఏపీకి రావాల్సి ఉందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, పరిపాలన దిద్దుబాటు, లా అండ్ ఆర్డర్ ప్రక్షాళన చేయాల్సి అవసరం ఉందని అన్నారు. సమర్థుడు, అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తారని అన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటాలను రాబట్టి.. టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో వ్యవస్థలను బలోపేతం చేస్తామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే రాయలసీమకూ సంపూర్ణంగా నీరు అందుతుందని అన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, ఆగస్టు 13: వివాహేతర సంబంధం నేపథ్యంలో కంబదూరు మండలంలోని ఐపార్సపల్లికి చెందిన దళిత తిప్పేస్వామి (42) మంగళవారం హత్యకు గురయ్యాడు. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు... మృతుడు తిప్పేస్వామి చెక్కభజన మాస్టరుగా మంచి పేరు సంపాదించాడు. గ్రామాల్లో చెక్కభజన నేర్పిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని నెలల కిందట కంబదూరు మండలంలోని రాళ్లపల్లిలో చెక్కభజన నేర్పడానికి వెళ్లాడు. అక్కడ ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనిని గుర్తించిన ఆమె తమ్ముళ్లు రాజు, నరేష్ పద్ధతి మార్చుకోవాలని తిప్పేస్వామిని హెచ్చరించారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో తిప్పేస్వామిని హత్య చేయాలని వారు ప్లాన్ వేసుకున్నారు. ఇది ఇలా ఉండగా తిప్పేస్వామికి ఐపార్సపల్లిలో ఆర్డీటీ గృహం మంజూరైంది. దాని నిర్మాణానికి అవసరమైన సిమెంటు కోసం మంగళవారం కంబదూరుకు వచ్చాడు. సుమారు 40 బస్తాలు కొని ఒక వాహనంలో వాటిని వేసి గ్రా మానికి పంపాడు. ఆ వాహనం వెళ్లిన కొద్దిసేపటికే తిప్పేస్వామి కూడా ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరాడు. అప్పటికే కాపు కాచిన రాజు, నరేష్‌లు కంబదూరు మల్లేశ్వరస్వామి దారి మధ్యలో తిప్పేస్వామి వాహనాన్ని అడ్డుకున్నారు. నీకు ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోవా అంటూ వాగ్వాదానికి దిగారు. మద్యం మత్తులో ఉన్న వారు బండరాయిని తీసుకుని తిప్పేస్వామి తలపై కొట్టారు. రక్తపు గాయాలతో ఆయన అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. ఆ దారిన వెళుతున్న ద్విచక్రవాహనదారులు గమనించి గుర్తుపట్టి తిప్పేస్వామి భార్య సుశీలమ్మకు సమాచారం అందించారు. భార్య సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న తిప్పేస్వామిని 108లో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతి చెందిన దళిత తిప్పేస్వామి

నిందితుల అరెస్టు

దళిత తిప్పేస్వామి హత్య కేసులో నిందితులైన రాజు, నరేష్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. ఈ మేరకు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వివాహేతర సంబంధంతోనే హత్య చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 13: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమో టా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 4500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

బీఫార్మసీ లాస్ట్‌చాన్స్ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ విద్యార్థుల లాస్ట్ చాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మే, జూన్‌లో ప్రథమ సంవత్సరం (ఆర్09,13)తోపాటు ఒకటో, రెండో సెమిస్టర్ (ఆర్15) పరీక్షలు నిర్వహించామన్నారు. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్స రాలకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సెమిస్టర్(ఆర్09,13,15) పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

80 శాతం సబ్సిడీ ఖరారు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13: ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు 80 శాతం సబ్సిడీ ఖరారైంది. వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది తదితర పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. ప్రధాన పంటల సాగుకు అదును దాటిపోయింది. దీంతో జిల్లాకు 27,907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1,501, అలసంద 3,253, జొన్న 973, కొర్ర 369, మినుములు 20 క్వింటాళ్లు ఉన్నాయి. వీటి ధరలను ఖరారు చేయలేదు. కేవలం 80 శాతం సబ్సిడీని వర్తింపజేయాలని నిర్ణయించారు. త్వరలోనే ధరలు, పంపిణీ తేదీ ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు



అనంతపురం రూరల్, ఆగస్టు 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.17 వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మా ర్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 331టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

'డీఎస్సీ కోచింగ్‌లో అవకాశం కల్పించండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 13: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన విద్యార్థులకు అందించే డీఎస్సీ ఉచిత కోచింగ్‌లో 500 మందికి అవకాశం కల్పించాలని ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సాకే చిరంజీవి జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులును కోరారు. మంగళవారం డీటీడబ్ల్యూఓను రామాంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పేద గిరిజన విద్యార్థులు బీఈడీ, టీటీసీ పూర్తిచేసి డీఎస్సీ కోచింగ్ తీసుకోవడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. అయితే దరఖాస్తులు చేసుకోవాలంటే టెట్ అర్హతను పెట్టడం జరిగిందన్నారు. దీనివల్ల అనేక మంది గిరిజన విద్యార్థులు ప్రస్తుతం టెట్ 2024 పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరందరూ నష్టపోయే అవకాశం ఉన్నందున టెట్ పరీక్ష రాయబోయే గిరిజన విద్యార్థులకు సైతం డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలని కోరారు.

కేరళ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తి (ఫైల్)

గుంతకల్లు, ఆగస్టు 13: మండలంలోని ఎన్.తిమ్మాపురం గ్రామంలోని శ్రీ రమ్యసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థిని ఎంఏ కీర్తి (20) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేరళలోని ఎర్నాకుళం పట్టణానికి చెందిన ఎంఏ కీర్తి బీఎస్సీ నర్సింగ్ జీఎన్ఎం మూడో సంవత్సరం చదువుతోంది. తరగతి గది నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వెళ్లిపోయిన ఆమె.. తిరిగి రాలేదు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్‌కు కూడా రాకపోవడంతో స్నేహితులు ఫోన్ చేశారు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో గదికి వెళ్లి చూశారు. తలుపు గడియ పెట్టుకుని ఉరి వేసుకున్నట్లు గుర్తించి, అధ్యాపకులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్లేసరికి ఆమె చనిపోయింది. విద్యార్థినికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, తండ్రి లేడని, తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, సోదరుడికి ప్రమాదంలో కాలువిరిగి ఆస్పత్రిపాలయ్యాడని పోలీసులు తెలిపారు. దీంతో మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కర్ రెడ్డి నర్సింగ్ స్కూల్‌కు వెళ్లి విచారించారు. విద్యార్థిని ఆత్మహత్య విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

తగ్గేదేలేదు..!

- బదిలీ వచ్చినా వెళ్లని సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- ఏసీబీలో గురుశిష్యుల హవా
- సీఐ, కానిస్టేబుల్‌పై తీవ్ర ఆరోపణలు

అనంతపురం క్రైం, ఆగస్టు 13: ఆ సీఐపై లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలున్నాయి. అయితే ఐదేళ్లుగా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో పనిచేస్తున్న ఆయన చాలానే ప్రభావం చూపారనే విమర్శలొచ్చాయి. గతంలో బదిలీ చేయాల్సి వచ్చినా పై స్థాయిలో మేనేజ్ చేసుకుని ఇక్కడే ఉండిపోయారు. గత నెలలో ఆ సీఐను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఈయనేమో వెళ్లేదిలేదంటూ చెబుతున్నారట. ఇక ఈయన శిష్యుడైన ఓ కానిస్టేబుల్ మరింత రెచ్చిపోతున్నాడట. సీఐ ఇంట్లో వ్యక్తిగత పనులు చేసి పెట్టే ఈ కానిస్టేబుల్ నాలుగేళ్లుగా బాగానే అక్రమార్జన చేశాడట. ఈ గురుశిష్యులకు ఆ శాఖ రాష్ట్ర స్థాయిలో పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ అధికారి అండ ఉందట. ఆ అధికారి ఇక్కడికి వస్తే సకల సౌకర్యాలు వీరిద్దరే కల్పిస్తుండటంతో ఆయన అభయం ఉందట. దీంతో ఈ ఇద్దరూ ఏసీబీలో తమకెదురే లేదని చెప్పుకుంటున్నట్లు సమాచారం. కానిస్టేబులైతే మా సీఐ సర్ ఉన్నంతవరకూ నన్నెవడేం చేయలేడంటూ బీరాలు పలుకుతున్నాడని ప్రచారం జరుగుతోంది. ఆ శాఖ ఉన్నతాధికారులకు మరి వీరి మాటలు చెవికెక్కాయో లేదో. గత నెల 24న సంబంధిత సీఐను కర్నూలు డీఐజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలందాయి. కానీ ఎవరిని మేనేజ్ చేసుకున్నారో కానీ ఆ సీటు వదలడం లేదు.

న్యాయాధికారుల నియామకం

అనంతపురం క్రైం, ఆగస్టు 13: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో కొత్తగా న్యాయాధికారులను నియమించారు. కొందరు న్యాయాధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారులను కొత్తగా నియమించారు. హిందూపురానికి లలితాలక్ష్మిని, అక్కడ పనిచేస్తున్న ఎస్.రాజ్యలక్ష్మిని ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. వెంకట హరీష్‌ను ధర్మవరానికి, అక్కడ పనిచేస్తున్న రమ్యసాయిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. తెలంగాణకు చెందిన శ్వేతను గుత్తికి కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన పావనిని అనంతపురం ఎక్సైజ్‌కోర్టుకు, విజయవాడకు చెందిన క్రిష్ణవేణిని తాడిపత్రికి కేటాయించారు.

బాలుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



మనోజ్‌కుమార్

గుత్తి, ఆగస్టు 13: తమ కుమారుడు మనోజ్‌కుమార్ అదృశ్యమైనట్లు పట్టణంలోని కోట వీధికి చెందిన తల్లిదండ్రులు కుళ్లాయిస్వామి, చౌడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు స్థానిక కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలుడు ఇంటికి తిరిగి రాలేదన్నారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 565 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 13: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 565 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయరులో ప్రస్తుత నీటి నిల్వ 0.314 టీఎంసీలు ఉందన్నారు.

వయనాడ్ బాధితులకు డాక్టర్లు, మెడికోల సాయం

వైద్యమంత్రికి రూ.4,08,602 అందజేత



వైద్యమంత్రి సత్యకుమార్‌కు చెక్‌ను అందజేస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, ఆగస్టు 13: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు అనంతపురం జీజీహెచ్ డాక్టర్లు, మెడికోలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల సంభవించిన వరదలకు వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలమంది ప్రాణాలు కోల్పోగా అనేకమంది నిరాశ్రయులయ్యారు. అక్కడ పరిస్థితులను చూసి చలించిపోయిన అనంత వైద్యకళాశాల డాక్టర్లు, పీజీ డాక్టర్లు, హౌస్‌సర్జన్లు, మెడికోలు తమవంతుగా రూ.4,08,602లు వసూలు చేశారు. ఆ సొమ్మును వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మంగళవారం విజయవాడలో రాష్ట్ర వైద్యశాఖామంత్రి సత్యకుమార్‌కు చెక్ రూపంలో అందజేశారు. వైద్యకళాశాల డాక్టర్లు, మెడికోలను మంత్రి అభినందించారు.



ఎమ్మెల్యే శ్రీవాత్సవ్ నుంచి అవార్డు అందుకున్న ధర్మవరం నాట్యకళాకారులు

ధర్మవరం కళాకారులకు అవార్డులు

ధర్మవరం, ఆగస్టు 13: ధర్మవరం పట్టణానికి చెందిన లలిత నాట్యకళానికేతన్ కళాకారులు వారణాసిలో శివగంగ, అయోధ్యలో బాలరామయ్య అవార్డులు అందుకున్నారు. ఆదివారం వారణాసిలోని ఆంధ్రభవన్‌లో, సోమవారం అయోధ్యలోని వైదేహిమందిర్‌లో నృత్యోత్సవాలు నిర్వహించారు. ఇందులో ధర్మవరం లలిత నాట్యకళానికేతన్ గురువులు బాబుబాలాజీ, కమల బాలాజీ, రామలాలిత్యతో పాటు 27 మంది కళాకారులు నాట్యంలో ప్రతిభ కనబరిచారు. దీంతో వారణాసిలో శివగంగ అవార్డును ఎమ్మెల్యే శ్రీవాత్సవ, అయోధ్యలో వల్లభ స్వామీజీ చేతులమీదుగా బాలరామయ్య అవార్డులు అందుకున్నారు.

బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులు

కొత్తచెరువు, ఆగస్టు 13: మండల కేంద్రంలోని పాత బీసీకాలనీలో పలు సమస్యలు తిష్ట వేశాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల సమయంలో బీసీ కాలనీ అభివృద్ధికి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ కాలనీలోని బీసీ హాస్టల్, ఇళ్లపై వెళ్తున్న 33 కేవీ మెయిన్ లైన్‌ను మార్చాలని, రోడ్లకు ఇరువైపుల డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై నిల్వ ఉంటోందని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై దృష్టిసారించాలని వారు కోరారు.

పాత్రికేయులకు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపు

పుట్టపర్తి, ఆగస్టు 13: పుట్టపర్తి నియోజకవర్గంలోని 101 పాత్రికేయులకు హెల్త్ ఇన్సురెన్సు ప్రీమియంను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం చెల్లించారు. మొత్తం ప్రీమియంను రూ. 1,26,250 చెల్లించినట్లు ఎమ్మెల్యే పీఆర్‌ఓ సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా అక్రిడేషన్ కలిగిన పాత్రికేయులు ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి



రమేశ్‌నాయుడు (ఫైల్)

ధర్మవరం : స్థానిక శివరాంనగర్‌లో నివాసముంటున్న ఓలేటి రమేశ్ నాయుడు (44) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. మండలంలోని ఓబుళనాయనపల్లి గ్రామం నుంచి ఐదేళ్ల క్రితం ధర్మవరం పట్టణానికి బతుకుతెరువు కోసం వలస వచ్చాడు. ఇక్కడ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుం టుండేవాడు. అయితే ఉన్నఫలంగా ఛాతీలో నొప్పిరావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఈయనకు భార్య ప్రభావతి, కుమార్తె మేఘన, కుమారుడు సాయికుమార్ ఉన్నారు. మేఘన బెంగుళూర్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం, కుమారుడు విజయవాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

మిత్రుడికి ఆర్థికసాయం

తనకల్లు, ఆగస్టు 13: స్థానికంగా నివాసముంటున్న రమేష్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బెంగళూరులోని జయదేవ్ ఆసుపత్రిలో బంధువులు చేర్పించారు. చికిత్సలు చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 2002-04 శ్రీగోవిందు నరసింహారెడ్డి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు, అతని స్నేహితులు టీమ్ భగత్ సింగ్‌గా ఏర్పడి, రూ.50వేల ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో చంద్రమోహన్, యోగి, రాంబాబు, పూల సురేంద్రరెడ్డి, విజయ్‌గాంధీ, పట్నుమస్తాన్, విశ్వనాథ్ ఉన్నారు.

సెబ్ పోలీస్‌స్టేషన్ల తనిఖీ

ధర్మవరం, ఆగస్టు 13 : ధర్మవరం సెబ్ పోలీస్‌స్టేషన్‌ను డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఎవరైనా అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా తదితర వాటిని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ధర్మరవం సెబ్ సీఐ గురుప్రసాద్ ఉన్నారు.

కదిరి అర్బన్: పట్టణంలోని సెబ్ సర్కిల్ కార్యాలయాన్ని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ నాగేంద్రమ్మ, ఎస్‌ఐ అహమ్మద్‌అలీబాషా, సిబ్బంది ఉన్నారు.

మద్యం బాటిళ్ల తొలగింపు

ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లి సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో విచ్చలవిడి మద్యం బాటిల్స్ ఉండడంపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంపద కేంద్రాలా... మందుబాబులకు నిలయాల అన్న వార్తను ప్రచురించింది. స్పందించిన కార్యదర్శి నౌషాద్, సర్పంచ్ రెడ్డిపల్లి శంకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆ కేంద్రంలోని మద్యం బాటిల్స్, కర్ణాటక టెట్రో ప్యాకెట్లను తొలగించారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవం

ఓబుళదేవరచెరువు : ఆజాదీకా అమృత్ మహోత్సవంలో మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. వెలుగు కార్యాలయం నుంచి వెలుగు సిబ్బంది, యానిమేటర్లు, ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఎం రమణప్ప, సర్పంచ్‌లు, కార్యదర్శులు రామలింగారెడ్డి, నౌషాద్, రఫీక్, చంద్ర, శ్రీకాంత్, ఎస్‌హెచ్‌సీ సభ్యులు, వీఓలు, ఓబీ సభ్యులు పాల్గొన్నారు.

కింకర రోడ్లు..!

- రోడ్ల అభివృద్ధి మరచిన గత ప్రభుత్వం
- అధ్వానంగా పల్లె దారులు
- ప్రయాణమంటేనే జనం బెంబేలు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



కరుకమానుతోపు వద్ద దెబ్బతిన్న ప్రధాన రహదారి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 13: గత వైసీపీ పాలన తీరుకు రోడ్లు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రహదారుల అభివృద్ధిని ఐదేళ్లు అటకెక్కించారు. కొత్త రోడ్ల సంగతి దేవుడెరుగు, ఉన్న వాటికి చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో గుంతలు ఏర్పడి, అవి భారీ గోతులుగా మారాయి. ఆ రోడ్లపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జనం ప్రయాణాలు సాగిస్తున్నారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధి వెంకటాపురం, కుంట్లపల్లి రహదారి ఘోరంగా ఉంది. ప్రతిరోజు ఈరహదారిలో పందుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, పెద్ద పెద్ద వాహనాలు వెళ్తుంటాయి. దీంతో ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గత్యంతరం లేక ఆ రహదారి పైనే ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారి వెంట ఓబుళదేవరచెరువు, అమడగూరు, కదిరి రూరల్ మండలాలకు వెళ్లాలి. గతంలో అరగంట పట్టే ప్రయాణం ప్రయాణం రెట్టింపు సమయం తీసుకుంటోంది. ఆదమరిస్తే ప్రమాదాలు తప్పడంలేదు.

ఇంకెన్నాళ్ళు..?

మండలంలోని వెంకటాపురం, తుమ్మల కుంటపల్లి, అమడగూరు మండలాలకు వెళ్లే ర హదారులు అధ్వానంగా తయారయ్యాయి. గత్యంతరం లేక ప్రజలు వాటిపైనే ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. రహదారులు బాగు చేయాలని గతంలో పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారులకు ఆయా గ్రామస్థులు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. వర్షాకాలంలో వెంకటాపురం రహదారి మరింత అధ్వానంగా ఉంటుంది. రహదారిపై ఏర్పడిన గుంతల్లో నీరు చేయడంతో వాహనదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో వెళ్లాలంటే సమయం అధికంగా పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్లు గడిచినా తారురోడ్డు వేయని దుస్థితి

మండలంలోని బందకిందపల్లి గ్రామానికి మూడేళ్ల క్రితం కంకర పరిచారు అయితే ఇప్పటికి కంకరపై తార్ వేకపోవడంతో, వృద్ధులు, వాహనదారులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కంకరపైనే ప్రయాణించాల్సి ఉండడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అంతేకాకుండా వాహనం నుంచి జారిపడి, ప్రమాదాలు జరుగుతున్నాయి. వృద్ధులు అయితే గమ్యానికి చేరుకోవడానికి కంకర రహదారిపై నరకం చూస్తున్నారు. అయినా అధికారుల్లో ఇంత వరకు చలనం లేకపోవడం విడ్డూరం.

కూటమి ప్రభుత్వంపైనే ప్రజల ఆశలు

ఐదేళ్ల వైసీపీ పాలనతో రహదారుల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించలేదు. నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రహదారులు బాగుచేస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి రహదారులను మరమ్మతులు చేయించాలని ప్రజలు ఆశిస్తున్నారు.



దెబ్బతిన్న వెంకటాపురం-కుంట్లపల్లి రహదారి

ప్రయాణం భారమవుతోంది



రోజురోజు రహదారులు అధ్వానంగా మారు తుండడంతో ప్రయాణం చేయాలంటనే బరవుతోంది. గతంలో తమ గ్రామనుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే 20నిమిషాలు పట్టేంది. ప్రస్తుతం రహదారులు దెబ్బతినడంతో రెట్టింపు సమయం పడుతోంది. వర్షం వచ్చినప్పుడు తమ కష్టాలు వర్ణనాతీతం. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి దెబ్బతిన్న రహదారులను బాగుచేయాలి.

\- చిన్నబాబు, వీరఓబున్నపల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయ్



మా గ్రామ రహదారికి కంకర పరచి యేళ్లు గడుస్తోంది. ఇంతవరకు తారు వేయని దుస్థితి. కంకర రోడ్డుపై ప్రయాణించాలంటేనే తలప్రాణం తోకకొస్తోంది. వాహనదారులు జారి పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. తార్ వేయాలని గతంలో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా, ఫలితం లేదు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే కంకర రహదారులకు తారు వేయాలి.

\- దినేష్, బండకిందపల్లి



తారు వేయని బండకిందపల్లి రహదారి

చెత్తతో సంపద కేంద్రాలను వినియోగంలోకి తెద్దాం

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 13: పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుదామని, చెత్తతో సంపద కేంద్రాలను వినియోగంలోకి తెద్దామని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సర్పంచులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కప్పలబండ వద్దగల చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు మూడు రోజుల శిక్షణనిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీఓ, ఈఓఆర్డీ అశోక్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... మండలంలోని సర్పంచులు వారి పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సిబ్బంది ద్వారా గ్రామపంచాయతీ పరిధి లోని ప్రతి ఇంటికి వెళ్ళి తడి చెత్తను, పొడిచెత్తను ఇళ్ళ దగ్గరే వేరువేరుగా సేకరించాలని, చెత్తతో సంపద సృష్టి కేంద్రాలకు తరలించే విదంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటన్నింటిపై ఆయా కార్యదర్శులు, సర్పంచులు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మండ లంలోని సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణారెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్, ఆగస్టు 13: పట్టణ శివారు ప్రాంతంలో మదనపల్లి రోడ్డులోని కౌలేపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పట్టణం నుంచి కౌలేపల్లికి వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి, జయమ్మ గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ బాబా ఫక్రుద్దీన్ ఫిర్యాదుమేరకు కారు డ్రైవర్ తేజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

పొడరాళ్ళపల్లి సమీపంలో...

ముదిగుబ్బ : పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొడరాళ్ళపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గూనిపల్లికి చెందిన రామాంజినేయులు ముదిగుబ్బ నుంచి గూనిపల్లికి ఆటోలో బయలుదేరాడు. గరుగుతండా వైపు నుంచి ముదిగుబ్బకు చెందిన చిన్నా బైక్‌లో బయలుదేరాడు. ఎదురెదురుగా ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో రామాంజినేయులుకు స్వల్ప, చిన్నా తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చిన్నాను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పట్నం ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

16న రాతిదూలం లాగుడు పోటీలు

ముదిగుబ్బ, ఆగసు 13 : ముదిగుబ్బ పాతూరులో 16న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు కోట్ల బాబి మంగళవారం పాత్రికేయులకు తెలిపారు. ఈ పోటీలలో జెర్సీ ఎద్దులకు అనుమతి లేదన్నారు.

21న పరుగు పోటీలు

కొత్తచెరువు, ఆగస్టు 13: జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక జూనియర్ కళాశాల క్రీడామైదానంలో పరుగుపందెం పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. అండర్-14, 17 విభాగాల్లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులపై విచారణ

కొత్తచెరువు, ఆగస్టు 13: కొత్తచెరువులోని మస్తాన్‌వలీ దర్గా ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, నగదు లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని మండల కేంద్రానికి చెందిన అజీజ్‌రహిమాన్, మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా, రఫీ తదితరులు వక్ఫ్‌బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు రాష్ట్ర విచారణ అధికారి నజీర్‌షాబ్ తన బృందంతో విచారణ చేపట్టారు. అనంతరం విచారణ అధికారి మాట్లాడుతూ... దర్గాకు సంబంధించిన ఆస్తులు, బాడుగలు, భూమి, నగదు తదితర వాటిపై గ్రామానికి చెందిన ముస్లింలు ఇచ్చిన ఆధారాల ప్రకారం ముతవల్లి అతావూర్ రహిమాన్‌తో వివరాలను సేకరించామన్నారు. మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని, అనంతరం నివేదికను వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సుల తనిఖీ

ధర్మవరం,ఆగస్టు 13: పట్టణంలో ప్రైవేటు స్కూల్ బస్సులను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి మంగళవారం తనిఖీచేశారు. బస్సులలో ఎఫ్‌సీ, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, టాక్స్ లేని మూడు బస్సులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు పాటించకుండా బస్సులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను ఎంవీఐ వరప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. కుటాగుళ్ల వద్ద ఈ తనికీలు చేశారు. ఈ తనిఖీల్లో తొమ్మిది వాహనాలపై కేసులు నమోదుచేసి, రూ.75వేలు అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎంవీఐ రాజేష్, సిబ్బంది ఉన్నారు.

పుట్టపర్తి నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 13: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి నుంచి తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. పౌర్ణమి సందర్బంగా ఈనెల 18న ఉదయం 6.30 ప్రత్యేక సుపర్ లగ్జరీ బస్సులు పుట్టపర్తి నుంచి బయలుదేరతాయన్నారు. మార్గమధ్యంలో కాణిపాక వినాయకుని దర్శనం, వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. అలాగే ఈనెల 17న హనుమాన్ స్పెషల్ బస్సు సర్వీసు ఉదయం 5 గంటలకు బయలుదేరి మురిడీ, నేమకల్లు, కసాపురం పుణ్యక్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. ప్రతినెలా పౌర్ణమికి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నిర్వహిస్తామన్నారు.

అంతటా జాతీయ జెండా ఎగరాలి

ముదిగుబ్బ, ఆగస్టు 13 : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని, ఈ నెల 15న అన్ని ఇళ్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురువేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వాసవీ కళ్యాణ మండపం వద్ద నుంచి కదిరి పెట్రోల్ బంక్ వరకు, ఎన్టీఆర్ కూడలి నుంచి దొరిగల్లు రోడ్డు పెట్రోల్ బంక్ వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, మాలపాటి రామకృష్ణ, బిల్లు కుళ్ళాయప్ప, జనసేన జయచంద్ర, వెంకటేష్, రమేష్, ఫణి, ప్రసాద్, ఇందుకూరు బాబు, గంగాధర్ రెడ్డి, గడ్డం మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



త్రివర్ణ పతాకాలతో నాయకుల బైక్ ర్యాలీ

అర్ధరాత్రి హోరు వాన

ఇళ్లలోకి చేరిన నీరు - జనం అవస్థలు

తనకల్లు, ఆగస్టు 13: మండలంలోని నల్లగుట్లపల్లిలో సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిగింది. సుమారు పది ఇళ్లల్లోకి నీరు చేరడంతో తిండిగింజలు, దుస్తులు, టీవీ, ఫ్రిజ్‌లు, నిత్యవరసర వస్తువులు నీట మునిగాయి. ఆ ఇళ్లలో వారు తమ పిల్లలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని.. బయటకు పరుగులు తీశారు. జాతీయ రహదారి విస్తర్ణలో భాగంగా రోడ్డును వెడల్పు చేశారు. రోడ్డుకిరువైపుల కాలువల నిర్మాణం చేపట్టారు. కాలువల ద్వారా వచ్చే నీరు మోరీ కింద నుంచి చెరువులోకి వెళ్లాల్సి ఉంది. అయితే మోరీ చిన్నదిగా ఉండడంతో నీరు ఇళ్లలోకి ప్రవేశించాయి. దీంతో పలువురికి చెందిన రెండు వందలకు పైగా కోళ్లు మృతువాతపడ్డాయి. దాదాపు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తమకు పరిహారం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బాధితుడు కరీముల్లాబాషా మాట్లాడుతూ తాను మోటారు సైకిల్ పైన బట్టల వ్యాపారం చేస్తానని, బట్టలన్ని తడిసి పోవడంతో రూ. లక్ష నష్టం జరిగిందని వాపోయాడు. తమ కుమారుడికి సంబంధించిన సర్టిఫికెట్లు అన్ని తడిసి పనికిరాకుండాపోయినట్లు ఆవేదన చెందారు.

తెగిపోయిన రెడ్డప్పకుంట

మండలంలోని చిన్నపల్లి గ్రామం వద్ద ప్రభుత్వం నిర్మించిన రెడ్డప్పకుంట సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తెగిపోయింది. దీంతో కుంటలో నుంచి నీరు వృథా అయింది. కుంటకింద చిన్నపల్లి, కోటపల్లి గ్రామస్థులు బోర్లతో వ్యవసాయం చేస్తున్నారు. పైన రెడ్డెప్పకుంటలో నీరుంటే తమ బోర్లలోయేడాది పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీరు వచ్చేవని, కుంట కట్ట తెగిపోవడంతో తమ బోర్లలో నీటి మట్టం తగ్గిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తలమర్లలోనూ విస్తృత వర్షం

కొత్తచెరువు : మండలంలోని తలమర్లలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి బోయవీధిలో నీరంత ఇళ్లలోకి చేరింది. ఆ నీరు పోయేందుకు ఉన్న కాలువను పూడ్చివేశారని, దీంతో వర్షపు నీరు అక్కడే చేరి మడుగులా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో నిత్యావసర వస్తువులు తడిసి పోయాయన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు నిలిచిన వర్షపు నీరు పోయేందుకు జేసీబీతో కాలువను యుద్ధప్రాతిపదికన తవ్వారు.

ధర్మవరంలో 62.4 మి.మీ వర్షపాతం

ధర్మవరం రూరల్ : మండల వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పారాయి. చెక్‌డ్యాంలు నిండిపోర్లాయి. ధర్మవరం మార్కెట్‌యార్డు సమీపంలో గొట్లూరు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన నీరు కుంటను తలపించింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గొట్లూరు సహకార బ్యాంకు ఎదుట వర్షపునీరు నిలిచింది. ఈ వర్షం పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం మండలవ్యాప్తంగా 62.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు డీవైఎస్‌ఓ గోపాల్ తెలిపారు.



నల్లగుట్లపల్లిలో ఇంటిలో చేరిన వర్షపు నీరు



తెగిపోయిన రెడ్డప్పకుంట





తలమర్లలోని బోయవీధిలో, ధర్మవరం మార్కెట్‌యార్డు వద్ద నిలిచిన వర్షపునీరు

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎంపిక

నల్లచెరువు, ఆగస్టు 13: మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పీ నరేష్‌కుమార్, ఉపాధ్యక్షుడి పీ గంగాధర్, అధ్యక్షుడు ఎస్. రమణప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ వసుంధరా, కోశాధికారిగా ఎస్ షబ్బీర్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎంపీడీఓ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఎన్నిక మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల గౌరవాధ్యక్షుడిగా టీడీ క్రిష్ణమూర్తి రెడ్డి, అధ్యక్షుడిగా ఎం. ధనుంజయ, ఉపాధ్యక్షుడిగా బాబ్‌జాన్, కోశాధికారి వి.చంద్రమోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌కుమార్, మోహసీనా, సభ్యులుగా సాధిక్, నజీర్, ఆంజనేయులు, రాజశేఖర్, ఎల్ ఆంజనేయులు, కె. ఆంజనేయులు, ఉదయ్‌కుమార్, కళ్యాణి తదితరులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

యువతి ఆత్మహత్య

ధర్మవరం, ఆగస్టు 13 : పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన అక్షయ(17) మంగళవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనీల్‌కుమార్, నాగవేణి దంపతులు అనంతపురంలో నివాసముంటున్నారు. అనీల్‌కుమార్ కడ్డీలు కడుతూ జీవిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం నాగవేణి తన భర్త, పాపను వదిలేసివెళ్లిపోయింది. ఈ క్రమంలో అక్షయ ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీలో ఉంటున్న అవ్వ, తాత ప్రబావతి, గోవిందరెడ్డి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతోంది. అక్షయ అనంతపురంలోని ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ ధర్మవరం నుంచి అనంతపురానికి వచ్చివెళ్లేది. మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. అక్షయ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.



పట్టణ వీధుల్లో భారీగా చేరిన వర్షపునీరు

పురం.. జలమయం..



జోరుగా కురుస్తున్న వర్షం

హిందూపురం, ఆగస్టు 13: పట్టణ, చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం అర్థ రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని హస్నాబాద్, ఎన్టీఆర్‌సర్కిల్ ప్రాంతాలతోపాటు టీచర్స్‌కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరింది. పట్టణంలో 74మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.. పరిగి మండలం మోదా గ్రామంలో పాఠశాల ఆవరణంలోకి నీరు రావడంతో మంగళవారం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మోదా పాఠశాల చుట్టూ చేరిన వర్షపునీరు

జూదరుల అరెస్ట్

● రూ.50,100 నగదు, ఏడు ద్విచక్రవాహనాల స్వాధీనం

చిలమత్తూరు, ఆగస్టు 13: మండల కేంద్రం శివారు ప్రాంతంలో పోలీసులు మంగళవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు హిందూపురం రూరల్ సీఐ జనార్ధననాయుడు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.51,100 నగదు, 10 సెల్‌ఫోన్లు, 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే సమాచారం ఇవ్వండి: సీఐ



మాట్లాడుతున్న సీఐ

చిలమత్తూరు, ఆగస్టు 13: ఎవరైనా ఈవిటీజింగ్‌కి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హిందూపురం రూరల్ సీఐ జనార్ధననాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికల హక్కు లు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవిటీజింగ్‌కి పాల్పడినా, వేధించినా వెంటనే 100 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అధ్యాపకులు జయసింహనాయుడు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ రామసుబ్బయ్య



ఉగ్రేపల్లి సమీపాన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మడకశిర రూరల్, ఆగస్టు 13: శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే వేరుశనగ అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. మంగళవారం మండలంలోని ఉగ్రేపల్లి, కదిరేపల్లి గ్రామాలో రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది, రాగి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఏడీ కృష్ణమీనన్, మండల వ్యవసాయాధికారులు తిమ్మప్ప, వీరనరేశ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
గుడిబండ: మండలంలోని నాచేపల్లి, వీరజ్జనపల్లి, తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తిపంట సాగును వ్యవసాయాఈటకారులు డా.రామసుబ్బయ్య, ఏడీఏ కృష్ణమీనన్‌లు మంగళవారం పరిశీలించారు. పత్తిపంటకు సోకే తెగుళ్ల నివారణకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ నరసింహమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథా



వృథాగా పోతున్న నీరు

మడకశిరటౌన్, ఆగస్టు 13: పట్టణంలోని జూనియర్ కళాశాల వెనకభాగంలో మంగళవారం తాగునీటి పైప్‌లైన్ పగలడంతో నీరు వృథాగా పారుతోంది. ఉదయం నుంచి నీరు పారిపోతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని స్థానికులు వాపోయారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నీరందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళలతోనే నవభారత నిర్మాణం

మహిళా ఆయోగ రాష్ట్ర అధ్యక్షురాలు డా. నాగలక్ష్మీచౌదరి



జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ నాగలక్ష్మీచౌదరి

పావగడ, ఆగస్టు 13: ప్రతి మహిళ నవభారత్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కర్ణాటక రాష్ట్ర మహిళా ఆయోగ అధ్యక్షురాలు డా.నాగలక్ష్మీ చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం సికెపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆమె మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. సికెపురం ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజులు, ఈఓ జానకిరాం, సీఐ సురేష్, సీడీపీఓ సునీత, అంగనవాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం రాకతో రైతుల్లో హర్షం



పచ్చదనం సంతరించుకున్న మొక్కజొన్న పంట

చిలమత్తూరు, ఆగస్టు 13: నెల రోజులుగా దోబూచులాడిన వరుణ దేవుడు ఎట్టకేలకు సోమవారం రాత్రి కరుణించాడు. మండలంలో 37.2 మి.మి వర్షం కురిసినట్లు అధికారులు పేర్కొన్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లారే దాకా కుండపోత వర్షం కురిసింది. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలను విత్తుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో మండలంలో వర్షం కురవలేదు. అయితే సోమవారం కురిసిన వర్షంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పంటలకు కావాల్సినంత తేమ దొరికింది. దీంతో పంట కొంత వరకు చేతికందే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

యూరియా కొరత

వర్షం కురవడంతో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు వేసుకోవడం కోసం రైతులు యూరియా కోసం దుకాణాలకు పరుగులు తీశారు. అనుకోకుండా డిమాండ్ పెరగడంతో అన్ని దుకాణాల్లో నిల్వలు లేకుండా పోయాయి. పలువురు రైతులు దుకాణాల వద్ద నుంచి వెనుదిరిగిపోయారు. వర్షం ఆశించిన స్థాయిలో కురవడంతో పంటకు ఎరువు వేసుకోవడానికి అనుకూలంగా ఉంది. కానీ యూరియా దొరక్కపోవడంతో చాలా మంది రైతులు కర్ణాటకలోని బాగేపల్లికి తరలివెళ్లారు.

కూలిన పాఠశాల ప్రహరీ

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కిరికెర బసవనపల్లి ఉన్నత పాఠశాల ప్రహరీ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఆ గోడ చాల కాలంగా ఒక పక్కకు ఒరిగి ఉండేది. రాత్రి వేళ కూలడంతో ప్రమాదం తప్పింది. విద్యార్థులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు స్పందించి ప్రహరీని నిర్మించాల్సిన అవసరం ఉంది.



కూలిన ప్రహరీ

చెత్త నుంచి సంపద సృష్టించాలి

● సర్పంచ్‌లకు అవగాహన కల్పించిన అధికారులు



తడి, పొడిచెత్త విధానాన్ని వివరిస్తున్న ఈఓఆర్డీ సుధాకర్

గోరంట్ల, ఆగస్టు 13: గ్రామాల్లో చెత్తను వృథాగా పడేయరాదని, దాని నుంచి సంపద సృష్టించాలని సర్పంచ్‌లకు అధికారులు సూచించారు. పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడురోజుల శిక్షణ నిర్వహిస్తున్నారు. రెండవరోజు శిక్షణలో భాగంగా మంగళవారం ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఈఓఆర్డీ సుధాకర్, వివరణాత్మకంగా సందేశాన్ని వివరించారు. అనంతరం గోరంట్లలోని డంపింగ్‌యార్డుకు వారిని తీసుకెళ్లి చెత్తలోతడి, పొడిని వేరు చేసి, తద్వారా సంపద ఎలా సృష్టించాలన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. సెప్టెంబరు 30 నాటికి డంపింగ్‌యార్డులను నిర్వాహణలోకి తీసుకురావడానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నవీన్, నీరంజన్, టీఓటిలు ప్రకాష్, యోగి, సురేష్, మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా హేమావతి

మడకశిర(అమరాపురం): మండలంలోని హేమావతి గ్రామంలో రెండో రోజు శిక్షణ తరగతుల్లో మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీలో, చెత్త నిర్వహణలో హేమావతి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈఓఆర్డీ నాగముని మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, మురికి కాలువలు శుభ్రం చేయించాలన్నారు.

డీఎల్‌డీఓ తనిఖీ

హిందూపురం(సోమందేపల్లి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన మూడు రోజుల సర్పంచ్‌ల శిక్షణా తరగతులను మంగళవారం డీఎల్‌డీఓ శివారెడ్డి తనిఖీ చేశారు. సర్పంచ్‌ల హాజరుపై ఆరాతీశారు. మండ్లి కార్యదర్శి గురుమూర్తి శిక్షణా తరగతులకు రాకపోవడంతో అతడికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఏఓ మురళికృష్ణను ఆదేశించారు. అనంతరం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద పంచాయతీల అభివృద్ధికి రూ.3కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. 15వ ప్రణాళిక సంఘం నిధులను పంచాయతీల అభివృద్ధికి క్లాప్‌మిత్రల జీతాలకు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.
గుడిబండ: గ్రామాభివృద్ధికి సర్పంచులు తోడ్పాటునందించాలని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

రవాణా శాఖాధికారి కరుణసాగర్ రెడ్డి హెచ్చరిక

హిందూపురం అర్బన్, ఆగస్టు 13: నిబంధనలు పాటించని పాఠశాల బస్సులపై చర్యలు తప్పవని రవాణాశాఖాధికారి కరుణసాగర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో హిందూపురం ఆర్టీఏ పరిధి పాఠశాలల బస్సులను ఆయన తనిఖీ చేశారు. ఇటీవల అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లి హైవే క్రాస్ వద్ద పాఠశాల బస్సు బోల్తాపడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటనపై సీఎం స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పాఠశాల బస్సులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించామన్నారు. పర్మిట్‌లేని వాహనాలు, ట్యాక్సులు లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు తనిఖీ చేసి నిబంధనలు పాటించని 15 బస్సులపై రూ.1,13,900 అపరాధ రుసుము విధించామన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలపై నిర్లక్ష్యం వద్దు

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి



విద్యార్థులతో చర్చిస్తున్న న్యాయాధికారి

పెనుకొండ రూరల్, ఆగస్టు 13: విద్యార్థుల సౌకర్యాలపై నిర్లక్ష్యం వహించరాదని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి బొజ్జప్ప.. సిబ్బందికి సూచించారు. మంగళవారం రొద్దం మండలంలోని దొడగట్ట కేజీబీవీని తనిఖీ చేశారు. అనంతరం సమస్యలపై విద్యార్థులతో ఆరాతీశారు. సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వద్దని సిబ్బందికి సూచించారు.

రజకులు సంఘటితంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

● టీడీపీ రజక సాధికారిక కమిటీ రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర



సమావేశంలో పాల్గొన్నరాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర

గోరంట్ల, ఆగస్టు 13: రజకులు ఐకమత్యంతో సమస్యల పరిష్కారం కోసం ఒకటిగా పనిచేయాలని టీడీపీ రజక సాధికారిక కమిటీ రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని దిగువగంగంపల్లిలో మంగళవారం జరిగిన రజకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రజక సంఘం నూతన కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడు ఓబులేసు, అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు గోపాల్, శాంతమ్మ, ప్రధాన కార్యదర్శి చలపతి, సహాయ కార్యదర్శి కార్తీక్, కోశాధికారి సాయికుమార్, కార్యనిర్వాహక సభ్యులను నియమించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వెంకటనారాయణ, అవినాష్, గణేష్, ఆదినారాయణ, శంకర్, వెంకటేష్, రాజ, రఘు తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల గోల్‌మాల్..!



ట్రాన్స్‌ఫార్మర్ తీసుల్లారని చూపుతున్న రామాంజినప్ప

పావగడ, ఆగస్టు 13: స్థానిక కొటగుడ్డం కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహించిన రామాంజనేయులు బెస్కాంకు చెందిన 13 ట్రాన్స్‌ఫార్లను ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా అమ్ముకున్నారని ఏఏపీ పార్టీ జిల్లా సంఘటన కార్యదర్శి ఎస్. రామాంజినప్ప ఆరోపించారు. నిడిగల్ ఓబళి పావగడ సబ్‌స్టేషన్‌లో ఆయన విధి నిర్వహిస్తున్న సమయంలో 11 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం అమర్చిన టాన్స్‌ఫార్మర్లను అక్రమంగా తరలించారన్నారు. మే31న ఆ అధికారి పదవీవిరమణ చేయడంతో ఆయనకు రావాల్సిన పింఛన్, ఇతర నిధులను నిలిపివేయాలని చిత్రదుర్గం బెస్కాం కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు.

జాతీయ పతాకంతో ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న ఉద్యోగులు

మడకశిర టౌన్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహిళా చైతన్య సమైఖ్య భవనంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలతో కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, యానిమేటర్లు, ఐకేపీ అధికారులు, వెలుగు సీసీ నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గోపాల్, సునీత, గ్రామ సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చాలని నిరసన

మడకశిర టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గుంత ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయని సీపీఐ, సీపీఎం నాయకులు మంగళవారం రోడ్డుపై ఉన్న గుంత వద్ద నిలబడి నిరసన తెలిపారు. రోడ్లను దిగ్బంధించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని సీపీఐ కార్యదర్శి ఆర్‌జీ పవిత్ర, సీపీఎం నాయకులు రామాంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఒకరి పరిస్థితి విషమం.. బెంగళూరుకు తరలింపు..

మడకశిర టౌన్, ఆగస్టు 13: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి బైక్ బోల్తాపడి మండలంలోని బుళ్ళసముద్రం గ్రామానికి చెందిన నరేష్, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యు.రంగాపురం వైపు నుంచి బుళ్ళసముద్రం గ్రామానికి నరేష్, మరోవ్యక్తి రాత్రి 9.30 గంటల సమయంలో బైక్‌లో బయల్దేరారు. పట్టణ సమీపాన జాతీయ రహదారిపై ఆవులను తిప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. క్షతగాత్రులిద్దరు బుళ్ళసముద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నట్లు సమాచారం.

అల్లుకుపోతున్న ప్రమాదం..!



స్తంభానికి అల్లుకున్న తీగలు

మడకశిర టౌన్, ఆగస్టు 13: నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి సమీపంలో ఉన్న ఏఎస్ఎన్ గార్మెంట్స్ పక్కన ఉన్న కరెంట్ స్తంభానికి పక్కనే ఉన్న చెట్టు తీగలు అల్లుకుపోతున్నాయి. వర్షంపడితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇన్ని రోజులుగా గమనిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో రోడ్డుపైనే విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతిచెందాడు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు మేల్కోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్ దర్శన్‌కు బస్సులు

పెనుకొండ, ఆగస్టు 13: శ్రావణమాసం సందర్భంగా పెనుకొండ డిపో నుంచి ఏర్పాటు చేసిన హన్‌మాన్ దర్శన్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఒకేరోజు కసాపురం, మురడి, నేమకల్లు అంజనేయస్వామిని దర్శించుకునే అవకాశం కల్పించామనీ, ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి శనివారం, మంగళవారం బస్సు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ 9908934955కు ఫోన్‌చేసి టికెట్లను బుక్ చేసుకోవాలని వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి



గౌస్‌పీర్ మృతదేహం

గోరంట్ల, ఆగస్టు 13: పట్టణంలోని శివాలయం కాలనీలో విద్యుదాఘాతంతో సోమవారం గౌస్‌పీర్(23) అనే మెకానిక్ మృతిచెందాడు. శివాలయం కాలనీలో కట్టా నారాయణ, కట్టా రామచంద్ర, పవర్‌లూమ్స్ నిర్వహిస్తున్నారు. వారు మగ్గాలను తమిళనాడువాసులకు విక్రయించారు. ఇంట్లో మగ్గాలను తొలగిస్తుండగా మెకానిక్ గౌస్‌పీర్ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి మహమ్మద్ పీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

ఎంపీ బీకే సంతాపం

పెనుకొండ, ఆగస్టు 13: అనంతపురానికి చెందిన టీవీ-5 కెమెరామన్ శేఖర్ గుండెపోటుతో మృతిచెందడంపై హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి మంగళవారం సంతాపం ప్రకటించారు. చిన్నవయసులోనే గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమనీ, మీడియా రంగంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. వారి కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నేలకూలిన విద్యుత్ స్తంభం

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 13 : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌వద్ద మంగళవారం ఐచర్ వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం నేలకూలింది. హిందూపురం వైపు నుంచిపెనుకొండ వైపుకు వెళ్తున్న ఓ వ్యాన్‌లో భారీ వినాయకుడిని తరలిస్తుండగా విగ్రహం విద్యుత్‌తీగలను తాకింది. గమనించని డ్రైవర్ వాహనాన్ని అలాగే పోనీయడంతో స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఎలాంటి జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలాన్ని చేరుకుని మరమ్మతులను చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మడకశిర(అమరాపురం), ఆగస్టు 13 : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. కొంత మంది విధులకు గైర్హాజరవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి, తిప్పజ్జ, టీఎన్‌టీయూసీ తాలూకా ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, నింగేగౌడ, మాజీ ఎంపీటీసీ శివకుమార్, వార్డుమెంబర్ గిరీష్, గౌడరంగప్ప తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను నియమించండి

మడకశిర(అమరాపురం), ఆగస్టు 13: అమరాపురం మండలానికి తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. పలు సర్టిఫికెట్ల కొరకు విద్యార్థులు, రైతులు, వృద్ధులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నార తక్షణమే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సోలార్ తంతుల ఏర్పాటును అడ్డుకున్నరైతులు



రైతు దంపతులపై దాడిచేస్తున్న పోలీసులు

పావగడ, ఆగస్టు 13: తమ పొలాల్లో సోలార్ ఏర్పాటును రైతులు అడ్డుకున్నారు. హరిక్యాతనహళ్లికి చెందిన రైతు దంపతులు తిమ్మక్క, నరసింహయ్య ఆరోపించారు. మంగళవారం పొలం వద్ద వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 147లో సోలార్ తంతులు వేయడానికి తమ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని, తమకు డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. కంపెనీవారు దౌర్జన్యంతో తంతులు వేస్తున్నారని, అడిగితే పోలీసులతో తమపై దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగేవరకు పొలాల్లో సోలార్ తంతులు వేయనీయమని వారు భీష్మించారు. పోలీసులు దాడి చేయడం చర్చనీయాంశమయ్యింది.

బెస్ట్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎండీ శౌర్యదోవల్

గోరంట్ల, ఆగస్టు 13: మండలంలోని 'బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీలో ద్వితీయ స్నాతకోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎండీ శౌర్యదోవల్ హాజరయ్యారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిండెంట్ అశుతోష్ శర్మ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. యూనివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్‌మీనా, చాన్సలర్ రూపావాసుదేవన్ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. వైస్ చాన్సలర్ సుబ్రహ్మణ్య, రిజిస్ట్రార్ జయప్రకాష్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ రాజన్న, ప్రోవిసీలు అనురాధ, నాగజ్యోతి, డీన్‌లు లక్ష్మీనరసప్ప, మోహూరి రాంగోపాల్, డైరెక్టర్లు స్టాలిన్, ఏవీఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ



ప్లేట్లను చూపుతున్న విద్యార్థులు

హిందూపురం(పరిగి), ఆగస్టు 13 : పరిగి మండలంలోని శాసనకోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రంగప్ప దాదాపు రూ.6,200 విలువచేసే ప్లేట్లను 65మంది విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఎంఈఓ-2 శేషాచలం ఆయన్ని ప్రశంసించారు. హెచ్‌ఎం ఆనందరాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫ్రెషర్స్ డే

పెనుకొండ రూరల్, ఆగస్టు 13: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. జూనియర్ విద్యార్థులకు, సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మద్దిలేటి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.